# రాజధానిలో ప్రీకాస్ట్ నిర్మాణాలు అవసరం

## పీఎస్ఐ అధ్యక్షులు సూర్యప్రకాశ్



భవన నిర్మాణాలపై సదస్సులో పాల్గొన్న నిపుణులు

**ఈనాడు, విజయవాడ :** అమరావతి రాజధాని పరిధిలో నిర్మించబోయే భవనాలను ప్రీకాస్ట్ విధానంలో చేపడితే సమయంతో పాటు పటిష్ఠతకు పెద్దపీట వేయొచ్చని ప్రీ ఇంజినీరింగ్ స్ట్రక్చర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఎస్ఐ) అధ్యక్షులు పి.సూర్యప్రకాష్ పేర్కొన్నారు. 'అడ్వాన్స్డ్ టెక్నాలజీస్ అండ్ గ్రౌండ్ ఇంజినీరింగ్' అనే అంశంపై విజయవాడలో ఒక రోజు జాతీయ కార్యశాలను శుక్రవారం నిర్వహించారు. పలువురు ఇంజినీరింగ్ నిపుణులు, కళాశాలల ప్రొఫెసర్లు, భవన నిర్మాణదారులు, సీఆర్‌డీఏ, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, నీటిపారుదలశాఖ అధికారులు హాజరయ్యారు. నవ్యాంధ్ర రాజధానికి అవసరమైన భవనాలను వేగవంతంగా చేపట్టేందుకు ఆధునిక సాంకేతికతను ఎలా వినియోగించాలనే అంశంపై ఈ కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. దేశంలో ప్రీకాస్ట్ టెక్నాలజీ అత్యంత వేగంగా విస్తరిస్తోందన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఈ సాంకేతికతను ఎక్కువగా వినియోగిస్తున్నారన్నారు. భూ పరీక్షలు నిర్వహించాక.. అక్కడ నిర్మించే భవనాలకు ఎలాంటి సాంకేతికతను వినియోగించాలనే విషయాలను ప్రముఖ ఇంజినీరు టి.రాంబాబు వివరించారు. ప్రస్తుత నిర్మాణాలకు అవసరమైన ఆధునిక సాంకేతికతను డిల్లీ ఐఐటీ విశ్రాంత డైరెక్టర్ వి.ఎస్.రాజు వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌బీఎల్‌పవర్ సిస్టమ్స్‌కు చెందిన కె.సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.